క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మద్దూరు: మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నిరంజన్‌దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఫీడర్ల మార్పు నిమిత్తం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

మొక్కలు సిద్ధం చేయండి

కొత్తపల్లి: వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ కృష్ణారావ్, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఎక్కామేడ్ గ్రామంలోని నర్సరీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీలో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. రోడ్ల పరిసరాల్లో, గట్ల ప్రాంతాల్లో, చెరువు కట్టలపై మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించి, మొక్కలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లి, వడ్వాట్ గ్రామాలలో జరిగిన ఉపాధిహామీ పనులను నాణ్యత తనిఖీ అధికారి చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో కాలువలు, మట్టి రోడ్లు, చెరువులలో పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల్లో నాణ్యాతా ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. అలాగే చేసిన పనులకు సంబంధించిన ఫైళ్లను ఎప్పటికప్పుడు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మన్యం, టీఏ హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుదాం



మద్దూరు: మద్దూరు మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుకుందామని పుర కమిషనర్ శ్రీకాంత్ కోరారు. శుక్రవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం 12వ రోజు పుర సిబ్బందికి మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రెనివట్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, గ్రామస్తులకు తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్తసేకరణ సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, గోవిందు, విజయ్, యాసిన్, పాఠశాల హెచ్‌ఎం రాజునాయక్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. 2025–26 విద్యా సంవత్సరానికి ప్రారంభంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రభుత్వం పాఠశాల హెచ్‌ఎం సరస్వతమ్మ తెలిపారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు.

ఎంఈఓ అక్షరాభ్యాసం

మక్తల్: మండలంలోని రుద్రసముద్రం, జక్లేర్ గ్రామాల్లో మండల పరిషత్ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు ఎంఈఓ అనిల్‌గౌడ్ అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. ముందుగా పాఠశాలల్లో సరస్వతి మాతకు పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నర్సింములు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ ప్రారంభం

మాగనూర్: అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని అడవిసత్యారంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు చిన్నారులకు ఎగ్ బిర్యానీ వండి వడ్డించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివరాం రెడ్డి మాట్లాడుతూ.. అంగన్ వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందించడం ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో అడ్మిషన్లు, చిన్నారుల హాజరు పెరిగే అవకాశం ఉందన్నారు.

చెరువుల దశ తిరిగేనా..!

- తూముల లీకేజీలతో వృథాగా పోతున్న నీరు
- అసంపూర్తిగా మిషన్ కాకతీయ పనులు
- నియోజకవర్గంలో 349 చెరువులు, కుంటలు



గండిపద్ద కిష్టంపల్లి చెరువు

మరికల్: నియోజకవర్గంలో సాగు, తాగు నీరందించే చెరువులను పట్టించుకోకపోవడంతో నీరంతా వృథాగా పోతుంది. సాగునీటి వనరులతో పాటు చేపల పెంపకం వంటి వాటి కోసం రైతులు, మత్స్యకారులు చెరువులు, కుంటలపైనే ఆధారపడుతున్నారు. అయితే చెరువుల లీకేజీలతో నీరంతా వృథాగా పోతున్న పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ కింద చెరువులకు మరమ్మతు పనులు చేపట్టారు. అయితే నూతన ప్రభుత్వంలో తూములు, అలుగులు, పాటు కాల్వలు, పొలాలకు వెళ్లే కాల్వలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో వర్షాలకు చెరువులు నిండిన ప్రతిసారి లీకేజీ అయి తూముల నుంచి నీరు వృథాగా పోతుంది. మిషన్ కాకతీయ తర్వాత వీటి నిర్వహణపై దృష్టి సారించలేదు. దీంతో కట్టలపై కాలినడకన కూడా వెళ్లలేని స్థాయిలో ముళ్లచెట్లు పెరిగిపోయాయి. గతంలో ఏటేటా ఉపాధి హామీతో ఒండ్రు మట్టి తరలించేవారు. ఇది నీటి నిల్వకు దోహదపడేది. ప్రస్తుతం జిల్లాకు చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మత్స్య, పశుసంవర్ధక, కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించడంతో చెరువుల దశ మారుతుందనే ఆలోచనలో మత్స్యకార్మికులు, రైతులు ఉన్నారు.

నీటి వనరులపై అలసత్వం

నారాయణపేట నియోజకవర్గంలో పెద్దగా ఆశించిన స్థాయిలో సాగునీటి ప్రాజెక్టులు లేవు. ఎక్కువగా చిన్ననీటి వనరులపైనే రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి. అయితే నిధుల లేమితో సాగునీటి వనరుల నిర్వహణను పట్టించుకోకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వేసవిలో మరమ్మతు పనులు చేపట్టాల్సిన అధికారులు వర్షాకాలం మొదలైనా ఇప్పటి వరకు వాటిపై దృష్టి సారించలేదు. దీంతో పలు చెరువుల తూములు ఏళ్లుగా నిర్వహణ లేక తుప్పు పట్టి అధ్వానంగా తయారయ్యాయి. మరికొన్ని చోట్ల బిగించిన తూములు, షట్టర్లు చోరీకి గురి కాగా కొన్ని ధ్వంసం అయ్యాయి. దీంతో వర్షాలకు చెరువులోకి చేరిన నీరు వృథాగా తూముల నుంచి బయటకు వెళ్లి పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు

మండలం	సంఖ్య
నారాయణపేట	189
దామరగిద్ద	72
ధన్వాడ	43
మరికల్	45

నిధులు మంజూరు చేయాలి



గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు నీటి వనరులుగా నిలిచిన చెరువుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద చెరువులను మరమ్మతులు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు చేపట్టి చెరువులు, కాల్వలకు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలి.

– ప్రకాష్, ఎలిగండ్ల

లీకేజీ కాకుండా చూడాలి



వర్షాలకు చెరువులు నిండితే తూముల ద్వారా నీరు వృథాగా పోతుంది. మరికల్‌లో నాన్‌చెరువు, కనకల్ చెరువుల తూములు, అలుగులు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. చెరువులో నీరు నిల్వ ఉంటే గ్రామానికి తాగునీటి వనరులతో పాటు సాగునీటి సమస్య కూడా తీరుతుంది. మరమ్మతులకు నోచుకోని చెరువులపై దృష్టి పెట్టాలి.

– తిర్మలయ్య, పెద్దచింతకుంట

ప్రతిపాదనలు పంపించాం

చెరువులకు సంబంధించి తూములు, అలుగులు, పాటు కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. వర్షాలకు ఎక్కడైనా తూములు, అలుగులు, కాల్వలు మరమ్మతుకు గురైతే తమ దృష్టికి తీసుకొస్తే తాత్కాలిక మరమ్మతులు చేపడతాం. దెబ్బతిన్న చెరువులు, కాల్వలను గుర్తించి నిధులు మంజూరు చేయాలని పై అధికారులకు నివేదిక పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి శాశ్వతంగా పనులు చేపడతాం.

– ప్రతాప్‌సింగ్, ఈఈ

పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం



ధన్వాడలో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజలు చేసిన నాయకులు

నారాయణపేట రూరల్: తెలంగాణ రాష్ట్రంలో బీద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి అన్నారు. మండలంలోని బండగొండ గ్రామానికి మంజూరైన 20 ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం ఆయన భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇస్తామని మోసం చేసిందన్నారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ అమలు చేస్తుందని, ఆరు గ్యారెంటీలు ప్రజలకు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ గోవింద్, రామచంద్రయ్య, మాధవరెడ్డి, శరణప్ప, అంజిరెడ్డి, రాములు, నరసింహులు, దస్తప్ప, నరసమ్మ పాల్గొన్నారు.

22 మందికి ఇళ్లు మంజూరు

కొత్తపల్లి: పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యమని నాయకులు రమేశ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నిడ్జింత గ్రామ పంచాయతీలో శుక్రవారం పలు ఇందిరమ్మ ఇళ్లకు గృహ నిర్మాణ శాఖ ఎస్‌ఈ బాల్‌రాం, డీఈ హరికృష్ణ, ఎంపీడీఓ కృష్ణారావ్‌తో కలిసి మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి 22 ఇళ్లు మంజూరు కాగా 4 ఇళ్లకు మార్కింగ్ చేసి భూమి పూజలు నిర్వహించినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో మండలంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

ధన్వాడ: ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన లబ్ధిదారులు శుక్రవారం భూమి పూజల కార్యక్రమలు నిర్వహించారు. ధన్వాడ మండల కేంద్రంలో మొదటి విడతలో మంజూరు అయిన ఇండ్లకు హౌసింగ్ ఏఈ బలరాం, పీడీ శంకర్‌లు మార్కింగ్ వేసి ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించుకోవాలని సూచించారు. ఇంటి నిర్మాణలు ప్రారంభించిన తరువాత విడతల వారిగా డబ్బులు అందజేస్తామన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

ఆత్మకూర్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకొని విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డీవైఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈఓ బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, స్కూల్ బస్సు, యూనిఫామ్స్ పేరిటా రూ.లక్షల్లో దోచుకుంటున్నారన్నారు. అటువంటి పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి కృష్ణమాంబ ఉత్సవాలు

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో నిర్మించిన కృష్ణమాంబ ఆలయం వద్ద శనివారం నుంచి 25వ ఆరాధన మహోత్సవం మొదలు కానుంది. కృష్ణమాంబ ప్రియ శిష్యుడు, ప్రముఖ డాక్టర్ గంగాధర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించనున్నారు. ఈనెల 20న రథోత్సవం, 21న పూర్ణాహుతి, గురుపాదుక పూజతో ఉత్సవాలను ముగించనున్నారు. ఉత్సవాల మొదటిరోజు నుంచి అఖండ భజనలు కొనసాగనున్నాయి. ఆలయం వద్ద ప్రతిరోజూ భక్తులకు అన్నదానం చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

న్యాయపరమైన కేసులు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో పేద మధ్యతరగతి రైతులు ఎదుర్కొంటున్న పలు భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూభారతి గ్రామ సదస్సుల ద్వారా రైతుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెబుతుందని న్యాయపరమైన కేసులు కూడా రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని రైతుల మధ్య తగాదాలు లేకుండా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మీసాల కురుమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, రైతులు చిన్నయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నారాయణపేట రూరల్: ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి సంరక్షించాలని డీఈఓ గోవిందరాజు సూచించారు. మండలంలోని జాజాపూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సరస్వతీ మాత చిత్రపటానికి పూజలు నిర్వహించి, ఒకటవ తరగతిలో చేరిన చిన్నారులకు అక్షరాలు దిద్దించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని, ఉచితంగా పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందిస్తున్నామని, పిల్లలకు పౌష్టికాహారం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ భాను ప్రకాశ్, ఏఏపీసీ చైర్మన్ బాలమణి, తపస్ జిల్లా కార్యదర్శి నరసింహ, ఉపాధ్యాయులు ప్రతాప్, మధుసూదన్, రఘురాం, లక్ష్మణ్, బాలకృష్ణ, గీత, రజిత పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయండి

మద్దూరు: మండలంలోని ఖాజీపూర్ గ్రామానికి చెందిన బండమీది బాబమ్మకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బాబమ్మ నిరసన చేపట్టగా సీపీఎం నాయకులు మద్దతు పలికారు. వితంతు అయిన బాబమ్మ ఇద్దరు పిల్లలతో రేకుల ఇంట్లో నివాసం ఉంటుందన్నారు. ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షానికి రేకుల ఇళ్లు కూడా కూలిపోయి రోడ్డున పడిందన్నారు. అధికారులు స్పందించి అన్ని అర్హతలు ఉన్న ఆమెకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎంపీఓ రామన్నకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంజిలయ్యగౌడ్, హన్మంతు, సాయిలు, సదానందం, హన్మంతు పాల్గొన్నారు.

రైతుభరోసాకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు: రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం పొందడానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల ఇన్‌చార్జి ఏఓ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతనంగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు రైతు భరోసా దరఖాస్తు ఫారం, పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలను స్థానిక ఏఈఓలకు ఈనెల 20వ తేదీలోపు అందజేయాలని సూచించారు. తమ ఖాతా వివరాలను మార్చుకోవాలనుకుంటే ఏఈఓలను సంప్రదించాలని పేర్కొన్నారు.

దయాకర్‌రెడ్డి సేవలు మరవలేనివి

కృష్ణా: మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి సేవలు మరవలేనివని కాంగ్రెస్ మండల నాయకులు రాకేష్ అన్నారు. శుక్రవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని టైరోడ్డులో దయాకర్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు.

మాగనూర్: మక్తల్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన అభిమాని వడ్వాట్ మాజీ సర్పంచ్ రవీందర్ మాట్లాడుతూ కార్యకర్తల కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన ఏకైక నేత దయాకర్ రెడ్డి అని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, తిప్పయ్య, సుధాంజనేయులు, యాకుబ్‌ఆలీ, వేణు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూర్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ శశిధర్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలో డ్రైడే–ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా స్థానికులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక కార్యాలయంలో కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలోనే మెరుగైన విద్య



తిరుమలాపూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని జీహెచ్‌ఎం సునీత అన్నారు. తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బడి ప్రచార రథం శుక్రవారం నారాయణపేట మండలంలోని కోటకొండ, తిరుమలాపూర్, అభంగాపూర్, బండగొండ గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను మెరుగుపరుస్తున్న విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సర్కారు బడులను బలోపేతం చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొత్త అడ్మిషన్ల సంఖ్యను పెంచాలన్నారు. ప్రణాళికబద్ధంగా బడిబాటను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శంకర్ నాయక్, శ్రీనివాస్, రమణ, అంబర్‌నాథ్, సాయి కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్‌కు బాటలు వేయండి

దామరగిద్ద: ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం వల్ల కలిగే ప్రయోజనాలను పాటలు, మాటల రూపంలో వివరిస్తూ తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని దామరగిద్ద, మొగుల్‌మడ్క, కాన్‌కుర్తి గ్రామాల్లో వినూత్న ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గల సదుపాయాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి వాటితో విద్యార్థులకు అన్ని విధాలుగా విజ్ఞానాన్ని అందించనున్నట్లు తెలిపారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.

గుండుమాల్‌లో బడిబాట

కోస్గి రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వ పాఠశాలలు ఎంతగానో ఉపయోగపడతాయని గుండుమాల్ మండల విద్యాధికారి శేఖర్‌రెడ్డి , తపస్ జిల్లా అధ్యక్షుడు మల్లిఖార్జున్ అన్నారు. శుక్రవారం గుండుమాల్ మండలంలో 'బడిబాట' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో మెరుగైన విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. అలాగే కంప్యూటర్‌పై అవగాహన, అధునాతన ప్రయోగశాలలు, డిజిటల్ తరగతులతో విద్య బోధన ఉంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు, దుస్తుల పంపిణీ



కృష్ణాలో విద్యార్థులకు యూనిఫామ్స్ అందిస్తున్న ఉపాధ్యాయులు

కృష్ణా: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ బడుల్లో చేర్పించి డబ్బును వృథా చేసుకోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కున్సీ ప్రధానోపాధ్యాయులు సంతోషి అన్నారు. శుక్రవారం పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ బడిబాటలో భాగంగా పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సోమశేఖర్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, రాంచందర్, సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోస్గి రూరల్: పిల్లల చదువుల విషయంలో తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గిస్తూ ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటేశ్వరి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముక్తిపాడ్ ప్రభుత్వ పాఠశాల, పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్యను అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, పీఎస్ కృష్ణారెడ్డి, మణెమ్మ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి



సంపల్లిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న తహసీల్దార్ బక్క శ్రీనివాసులు

నారాయణపేట రూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. మండలంలోని కోటకొండ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని ప్రజలు, రైతుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ ఐ గోపాల్, మాజీ సర్పంచ్ జయలక్ష్మి, రాజేష్, ప్రవీణ్, అనిల్, రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు కొనసాగిస్తున్నట్లు కోస్గి, గుండుమాల్ మండల తహసీల్దార్‌లు బక్క శ్రీనివాసులు, భాస్కరస్వామి అన్నారు. శుక్రవారం భూభారతి రెవెన్యూ సదస్సులో భాగంగా కోస్గి మున్సిపాలిటీ పరిధిలోని సంపల్లి , మీర్జాపూర్‌లో నిర్వహించిన సదస్సులలో 37 ఫిర్యాదులు, గుండుమాల్ మండలంలోని వీరారంలో 20 ఫిర్యాదులు అందాయన్నారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరిస్తామన్నారు.

నీతి ఆయోగ్ సర్వేపై ఎన్యుమరేటర్లకు శిక్షణ



ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇస్తున్న సిబ్బంది

మాగనూర్: నీతి ఆయోగ్‌కు సంబంధించిన సర్వేపై ఎన్యుమరేటర్లకు శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో బీపీఎల్ కింద ఉన్న కుటుంబాలు, దివ్యాంగుల కుటుంబాలు, విద్యకు దూరంగా ఉన్న కుటుంబాలు తదితర అంశాలపై నీతి ఆయోగ్ సర్వే ఏ విధంగా చేయాలని పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ వర్కర్లు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నీతి అయోగ్ శిక్షణ సిబ్బంది నరేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ రెడ్డి

ధన్వాడ: మండలంలోని పెద్ద చెరువులోని ఒండ్రు మట్టిని అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం సరికాదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 50 ట్రిప్పులకు అనుమతులు తీసుకొని వెయ్యి ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. రైతుల పొలాల్లోకి వెళ్లాల్సిన ఒండ్రు మట్టిని ఇటుక బట్టీలకు తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా ఇరిగేషన్ పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే మట్టిని తరలిస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుదిర్‌కుమార్‌రావు, పట్టణ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, మాజీ సర్పంచు లక్ష్మారెడ్డి, నాయకులు సత్యనారాయణ, మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి



పెద్దపొర్లలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

ఊట్కూరు: జిల్లా టీయూసీఐ ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించనున్న ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు కనకరాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పెద్దపొర్ల, చిన్నపొర్ల, మల్లెపల్లి తదితర గ్రామాల్లో మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. మహాసభలో ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్‌లు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హనుమంతు, వెంకటయ్య, కిష్టప్ప, బాలకిష్టప్ప, హనుమంతు, తాయప్ప, శివరాజప్ప తదితరులు పాల్గొన్నారు.